సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 31 । జనవరి । 2025



పన్నుల వసూలుపై నజర్

ఆస్తి పన్ను వసూలుపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. వంద శాతం రాబట్టడమే లక్ష్యంగా చర్యలు చేపట్టారు. 8లో▸



ఫార్మా కాదు.. ఫ్యూచర్‌సిటీ

ఫార్మాసిటీ రద్దయినట్లే.. అది ఫ్యూచర్‌సిటీనే అని ఎవరూ ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 8లో▸



సాధ్యంకాని హామీలతో..

సాధ్యంకాని హామీలతో అధికారం చేపట్టి, ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

డీసీసీబీ కార్యాలయానికి భూ కేటాయింపుపై హర్షం



కలెక్టర్‌ను సన్మానించిన కొత్తకుర్మ సత్తయ్య తదితరులు

తుర్కయంజాల్: డీసీసీబీ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం ఆదిబట్లలో ఎకరం భూమి కేటాయించడంపై టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డీసీసీబీ సీఈఓ భాస్కర సుబ్రహ్మణ్యం, జీఎం ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


'సహకారం' భేష్



తుర్కయంజాల్ సహకార సంఘం వద్ద ఒడిశా సభ్యుల బృందం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం పనితీరు బాగుందని ఒడిశా బృందం కితాబిచ్చింది. ఒడిశా రాష్ట్రంలోని రైడ జిల్లాకు చెందిన 15 రైతు సేవా సహకార సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల బృందం గురువారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా సంఘం పనితీరును బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని సహకార సంఘాల్లో ముందంజలో ఉండడంపై అభినందించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవ రెడ్డి, సొసైటీ సీఈఓ వై.రాందాసు పాల్గొన్నారు.

చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌గా పూర్ణ చందర్



చేవెళ్ల: నూతనంగా ఏర్పాడిన చేవెళ్ల మున్సిపాలిటీకి కమిషనర్‌గా ఎం.పూర్ణ చందర్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే ఏర్పడిన మున్సిపాలిటీకి రెండు రోజుల క్రితం నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డిని ఇన్‌చార్జి కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన బాధ్యతలు తీసుకున్న రెండురోజుల్లోనే రెగ్యులర్ కమిషనర్‌గా పూర్ణచందర్‌ను వనపర్తి మున్సిపాలిటీ నుంచి బదిలీ చేసింది. నూతనంగా వచ్చిన కమిషనర్‌కు మున్సిపల్ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

మొయినాబాద్ కమిషనర్‌గా ఖాజా మొయిజుద్దీన్



మొయినాబాద్: మున్సిపల్ కమిషనర్‌గా ఖాజామొయిజుద్దీన్‌ను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల కొత్తగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీకి ఈ నెల 27న ఇన్‌చార్జి కమిషనర్‌గా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర బాధ్యతలు చేపట్టారు. తాజాగా ప్రభుత్వం పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించింది. జల్‌పల్లి మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేసి పదోన్నతి పొందిన ఖాజామొయిజుద్దీన్‌ను మొయినాబాద్ కమిషనర్ బదిలీ చేశారు. కొత్త కమిషనర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా యోగేష్



శంకర్‌పల్లి: మున్సిపల్ కమిషనర్‌గా ఎ.యోగేష్‌ను నియమిస్తూ గురువారం మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. యోగేష్ ప్రస్తుతం నార్సింగి మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా.. పదోన్నతిపై శంకర్‌పల్లి మున్సిపాలిటీకి కమిషనర్‌గా వచ్చారు. ప్రస్తుత కమిషనర్‌గా పనిచేసిన శ్రీనివాస్‌ని జీహెచ్‌ఎంసీకి బదిలీ చేశారు. కొత్త కమిషనర్ యోగేష్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ముచ్చటగా మూడోసారి

షాద్‌నగర్ నియోజకవర్గానికి సీఎం రేవంత్ రెడ్డి

- నేడు మొగిలిగిద్ద పాఠశాల 150 వసంతాల వేడుకకు హాజరు
- బహిరంగ సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ నారాయణరెడ్డి



సభా ప్రాంగణం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

షాద్‌నగర్: ప్రతిపక్ష నేతగా పలుమార్లు పర్యటించారు.. రాహుల్ గాంధీని సైతం తీసుకువచ్చారు.. ముఖ్యమంత్రి అయ్యాక మూడు నెలల వ్యవధిలో ముచ్చటగా మూడోసారి షాద్‌నగర్ నియోజకవర్గానికి వస్తున్నారు.. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద పాఠశాల వేడుకలకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. గత సంవత్సరం అక్టోబర్ 11న నియోజకవర్గంలోని కొందుర్గు మండలం కేంద్రంలో రూ.150కోట్లతో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చారు. గత డిసెంబర్ 29న నందిగామ మండలం కన్హా శాంతి వనానికి విచ్చేశారు. ప్రస్తుతం మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150 ఏళ్ల ఉత్సవానికి హాజరుకానున్నారు.

అభివృద్ధిపై ఆశలు

సీఎం పర్యటన నేపథ్యంలో నియోజకవర్గానికి వరాలు కురిపిస్తారని ఇక్కడి ప్రజల ఆశలు మరింత పెరిగిపోయాయి. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా జిల్లేడు చౌదరిగూడ మండలంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించనున్నారు. నేటికీ ఈ రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీనిపై ముఖ్యమంత్రి నుంచి ప్రకటన వస్తుందోనని భావిస్తున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. మరమ్మతులకు నిధులు మంజూరు కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు.

మారనున్న మొగిలిగిద్ద రూపురేఖలు

మొగిలిగిద్ద గ్రామంలో ప్రభుత్వ పాఠశాల స్థాపించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు సీఎం వస్తున్న వేళ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు దృష్టి సారించారు. పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ తదితర వసతుల కల్పనతో పాటు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, ఆరోగ్య సబ్ సెంటర్, నీటి సదుపాయాల కోసం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పాఠశాలలో నిర్వహించే ఉత్సవాలు, బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామ శివారులోని మైదానంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సుమారు పదివేల మందితో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సభా వేదిక, వాహనాల పార్కింగ్, పాఠశాలలో సీఎం సందర్శన తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

నాబార్డ్ కరదీపిక ఆవిష్కరణ



కరదీపికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: నాబార్డ్ ద్వారా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్‌ప్లాన్ 2025–26 కరదీపికను గురువారం కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆవిష్కరించారు. నాబార్డ్ ప్రతి జిల్లాకు ప్రతి సంవత్సరం పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ని సిద్ధం చేస్తుంది. ప్రాధాన్యత విభాగంలో జిల్లాలో అందుబాటులో ఉన్న భౌతిక, ఆర్థిక సామర్థ్యాన్ని అంచనా వేస్తుంది. దీన్ని ఆధారంగా చేసుకొని లీడ్ బ్యాంక్ జిల్లాలోని వివిధ బ్యాంకుల ద్వారా అమలు చేయడానికి వార్షిక జిల్లా క్రెడిట్ ప్లాన్‌ని సిద్ధం చేసింది. పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ కోసం రూ.4,633.34 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల కోసం టర్మ్‌లోన్ రూ.2,107.22 కోట్లు, వ్యవసాయం, మౌలిక సదుపాయాల కోసం రూ.803.19 కోట్లు, అనుబంధ కార్యకలాపాల కోసం రూ.2,464.30 కోట్లు, సూక్ష్మ చిన్న మధ్యతరహా సంస్థలు ఎంస్‌ఎంఈ కోసం రూ.20,342.65 కోట్లు సహా జిల్లా మొత్తం ప్రాధాన్యత రంగానికి రూ.32,062.17 కోట్లుగా నాబార్డ్ ఆర్థిక అంచనా వేసింది. కార్యక్రమంలో డీడీఎం పి.హర్ష రఘురామ్, ఎల్‌డీఎం యాదగిరి, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధి హామీ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని జిల్లా ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కందుకూరి నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ సి.నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ.. ఉపాధి హామీలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కన్సల్టెన్సీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, క్షేత్ర సహాయకులు, ఇతర సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని అన్నారు. దీంతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేయలేక, ఈఎంఐలు చెల్లించలేక, పిల్లల ఫీజులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుకోసం సెలవులు లేకున్నా నిరంతరం పని చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయలని కోరారు. మంత్రి సీతక్క పేస్కేల్ ఇస్తున్నట్లు ప్రకటించి నేటికీ అమలు చేయడం లేదని వాపోయారు. పెండింగ్ జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షులు చరణ్, గౌతం, జనరల్ సెక్రెటరీ తిరుపతాచారి, కో చైర్మన్ నర్సింహులు, వీరాసింగ్, లలిత, కోశాధికారి లలిత తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ సర్వేను అడ్డుకున్న గిరిజనులు



గిరిజనులతో మాట్లాడుతున్న కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

ఆమనగల్లు: ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి ఫోర్త్‌సిటీ మీదుగా ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు సర్వేను ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండాలో గిరిజనులు మరోసారి అడ్డుకున్నారు. సర్వేను ఈనెల 9న ఆమనగల్లు మండలంలో నిర్వహించిన సమయంలో గిరిజన రైతులు అడ్డుకున్నారు. రెండురోజులుగా ఆమనగల్లు తహసీల్దర్ కార్యాలయంలో సాకిబండతండా గిరిజనులతో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండా సమీపంలో గురువారం సిబ్బంది మరోసారి సర్వే నిర్వహించేందుకు సిద్ధం కాగా గిరిజనులు అడ్డుకున్నారు. కందుకురు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, వారితో మాట్లాడారు. తమ భూ సమస్యలు పరిష్కరించి, ఎకరాకు రూ.2కోట్ల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఫోర్త్‌సిటీలో వందగజాల ఇంటిస్థలం ఇవ్వాలని గిరిజనులు డిమాండ్ చేశారు. రోడ్డు సర్వే పనులను అడ్డుకోవడంతో సర్వే సిబ్బంది వెనుదిరిగారు.

'కన్హా'లో ఐపీఎస్ అధికారుల బృందం



నందిగామ: మండల పరిధిలోని కన్హా శాంతి వనాన్ని ఐపీఎస్‌ల బృందం గురువారం సందర్శించింది. నాలుగు రోజుల డీప్ యు ఇండియా రిట్రీట్ కార్యక్రమంలో భాగంగా హ్యూమన్ ఫ్లరిషింగ్ ప్రఖ్యాత వక్త వాస్కో గ్యాస్పర్ ఆధ్వర్యంలో 40 మందికిపైగా ఐపీఎస్ అధికారుల బృందం ప్రత్యేకంగా సందర్శించి, ధ్యానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వీయ ఆవిష్కరణ, స్వస్థత, జీవితంలో లక్ష్యాన్ని కనుగొనడం, పరివర్తనలో మార్పు తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ సందర్భంగా వాస్కో గ్యాస్పర్ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ధ్యానం చేసినట్లయితే మానసికంగా ప్రశాంతంగా ఉంటామని, ఒత్తిడిని తట్టుకొని ఏకగ్రత పెరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ధ్యానం చేయాలని సూచించారు.

పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: గుండెపోటు బారిన పడినవారికి సంజీవని లాంటి సీపీఆర్ విధానంపై నగర కమిషనరేట్‌లో పని చేస్తున్న ప్రతి ఒక్క అధికారి, సిబ్బందికి శిక్షణ ఇప్పించాలని సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ నిర్ణయించారు. ట్రాఫిక్ సహా వివిధ విభాగాల్లో పని చేస్తున్న 1,409 మందికి ఇప్పటికే పూర్తి కాగా.. మరో 1,248 మందికి శిక్షణ ఇవ్వడానికి మెహిదీపట్నంలోని మైత్రీ హాస్పిటల్స్ ముందుకు వచ్చింది. గురువారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో కమిషనర్ సీవీ ఆనంద్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొత్తం 15 బ్యాచ్‌లుగా శిక్షణ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఇది కేవలం ప్రజలకే కాకుండా పోలీసు కుటుంబాలకూ పనికి వచ్చే అంశమని అన్నారు. ఓ సర్వే ప్రకారం దేశంలో 98 శాతం మందికి సీపీఆర్ విధానంపై అవగాహన లేదని, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఇది చాలా అవసరమని ఆనంద్ వ్యాఖ్యానించారు. అమెరికా, జపాన్, సింగపూర్‌తో పాటు యూరోపియన్ దేశాలు తమ విద్యావిధానంలో సీపీఆర్‌ను బోధించడం తప్పనిసరి చేశాయని, దీనిపై అవగాహన లేని కారణంగానే ఇక్కడ మరణాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

నిధుల దుర్వినియోగం లేకుండా ఆడిటింగ్

జిల్లా ఆడిటింగ్ అధికారి విజయ్‌కుమార్



హిమాయత్‌నగర్ పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారి విజయ్‌కుమార్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పరంగా పంచాయతీల నిర్వహణ, ఖర్చు పెట్టిన డబ్బులను అధికారులు దుర్వినియోగం చేయకుండా ఆడిటింగ్ చేయడం జరుగుతుందని జిల్లా ఆడిటింగ్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్, ఎన్కెపల్లి గ్రామాల్లో అధికారులు గురువారం ఆడిటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో కలిసి గ్రామాల్లో ఖర్చు పెట్టిన పరిపాలనకు సంబంధించిన ఖర్చులను, ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. 2024 సంవత్సరానికి సంబంధించి పంచాయతీ పాలనలో ఖర్చు చేసిన నిధులు, వాటి బిల్లులను పరిశీలించి ఆడిటింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరిగినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ పంచాయతీ అధికారి సంధ్యారాణి, ఎన్కెపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుష్ప విలాపం

- పడిపోయిన పూల ధరలు
- నెలరోజులుగా ఇదే పరిస్థితి
- ఆందోళనలో రైతులు
- ఖర్చులకు కూడా రావడం లేదని ఆవేదన



బంతి చేను

మొయినాబాద్: పూలు రైతులను ఎప్పుడు మురిపిస్తాయో.. ఎప్పుడు ముంచేస్తాయో తెలియడం లేదు. గతేడాది మంచి ధర పలకగా ఈసారి మాత్రం పారబోస్తున్న పరిస్థితి నెలకొంది. నెలరోజుల క్రితం వరకు కాస్తోకూస్తో ధర పలికినా ఈనెలలో అమాంతం పడిపోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో అన్ని రకాల పూల ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలైన మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్, శంషాబాద్, మహేశ్వరం, కందుకూరు మండలాల్లో పూలసాగు అధికంగా ఉంటుంది. ప్రతి సంవత్సరం రైతులు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా చామంతి, బంతి, గులాబీ, చాందిని, హాస్టల్ తదితర పూలు వేస్తుంటారు. హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్‌లో పూల మార్కెట్ అందుబాటులో ఉండటంతో రైతులు ఎప్పటికప్పుడు పూలు కోసుకుని తాజాగా మార్కెట్‌కు తరలిస్తారు. ప్రస్తుతం పూలకు మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతేడాదితో పోలిస్తే దిగజారి..

గత సంవత్సరం ఇదే సమయంలో పూలకు మంచి డిమాండ్ ఉంది. మార్కెట్‌లో కిలో రూ.100 నుంచి రూ.300 వరకు ధర పలికాయి. ప్రస్తుతం కిలో రూ.10 నుంచి రూ.60 వరకు మాత్రమే ఉంది. డిసెంబర్ వరకు అంతంత మాత్రంగా ఉన్న ధరలు జనవరి వచ్చేసరికి మరింత దిగజారిపోయాయి. ఖర్చులకు సరిపడా కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెంపడానికి కూలీలు సైతం దొరక్కపోవడంతో రైతులే రేయింబవళ్లు పూలు తెంపుకొని మార్కెట్‌కు తరలిస్తున్నారు. తీరా వెళ్లాక ధర లేకపోవడంతో ఒక్కోసారి పారబోయాల్సిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు.



తెల్లచామంతి పూలు తెంపుతున్న యువకుడు

ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు (కిలో..)

పూల రకం	ధర రూ.
బంతి	10–20
చామంతి	30–50
చాందిని	10–20
గులాబీ	40–60

మార్కెట్‌లో ధర లేదు



ప్రస్తుతం మార్కెట్‌లో పూల ధరలు పూర్తిగా పడిపోయాయి. కిలో రూ.20–40 అమ్మితే కూలి, ఖర్చులకు సైతం సరిపోవడం లేదు. పూల సాగుకు పెట్టుబడి కూడా ఎక్కువ అవుతోంది. కూలీలు సరిగా దొరకడంలేదు. రాత్రి సమయంలో పూలు తెంపడానికి వచ్చే కూలీలకు ఎక్కువ డబ్బులు ఇవ్వాల్సి వస్తోంది. ధరలు ఇలాగే ఉంటే తీవ్రంగా నష్టపోతాం.

– ఎల్లెందర్, రైతు, అమ్డాపూర్, మొయినాబాద్ మండలం

ఇలా అయితే నష్టమే..



రెండు ఎకరాల్లో చామంతి పూలు సాగుచేశాను. పెట్టుబడికే రూ.లక్షలు ఖర్చయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పూలకు సరైన ధర లేదు. ధరలు ఇలాగే ఉంటే పెట్టుబడి డబ్బులు రావడం కూడా కష్టమే. వచ్చే నెలలో పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్నాయని అంటున్నారు. అప్పుడైనా ధరలు పెరిగితే కాస్త లాభం వస్తుందని ఆశిస్తున్నాం.

– శ్రీనివాస్, రైతు, మల్కారం, శంషాబాద్ మండలం



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి నాయకులు

సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- మాట నిలుపుకోలేని ప్రభుత్వం
- 420 హామీలతో మోసం
- ఎమ్మెల్యే సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: అమలు సాధ్యంకాని హామీలతో అధికారం చేపట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం సరూర్‌నగర్ డివిజన్ పార్టీ నాయకులు కొండల్‌రెడ్డి, అశోక్‌ల ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీల వినతిపత్రాన్ని గాంధీ విగ్రహానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరుతో బూటకపు హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని విమర్శించారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి, 420 రోజులు గడుస్తున్నా మాట నిలబెట్టుకోలేక పోతుందని పేర్కొన్నారు. మంత్రులకు పరిపాలనపై అవగాహన లేదని, ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని గాంధీ విగ్రహానికి విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్ శర్మ, నగేష్, శ్రీధర్, సుశీలరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎం.ఏ.సాజిద్, పెంబర్తి శ్రీనివాస్, జగన్మోహన్‌రెడ్డి, మల్లేశ్ ముదిరాజ్, వెంకటేష్‌గౌడ్, రమేష్, రాజేష్‌గౌడ్, రిషీ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మహాత్మా.. దారి చూపించు

చేవెళ్ల: అసమర్థ ప్రభుత్వానికి కళ్లు తెరిపించి, దారి చూపించు మహాత్మా అని డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల క్రిష్టారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మండల పరిధి తలారం గ్రామంలో గాంధీ విగ్రహానికి ఆయన వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు అవుతుందని, కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అమలు సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిందని విమర్శించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: తలారంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్యం మత్తులో పురుగు మందు తాగి..

వ్యక్తి మృతి

కేశంపేట: మద్యం మత్తులో పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశంపేటకు చెందిన గుంటి ఆంజనేయులు(36) మద్యం మత్తులో ఇంట్లో పురుగు మందు తాగి పడిపోయాడు. గుర్తించిన కుటుంబీకులు షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి 108లో తరలించగా.. పరిశీలించిన వైద్యులు, అప్పటికే ఆంజనేయులు మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

డాక్టర్‌తో గ్రామస్తుల వాగ్వాదం

పురుగు మందు తాగిన ఆంజనేయులును తొలుత స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యసిబ్బంది లేకపోవడంతో 30 నిమిషాలు ఆస్పత్రి వద్దే వేచిఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అక్కడి నుంచి షాద్‌నగర్‌ను తీసుకెళ్లగా చనిపోయాడని, పీహెచ్‌సీలో డాక్టర్ ఉంటే.. ఇలా జరిగుండేది కాదని వాపోయారు. ఇదే విషయమై గురువారం కేశంపేట డాక్టర్ నిఖితను గ్రామస్తులు వివరణ కోరగా.. సిబ్బంది వంట చేసుకోవడానికి వెళ్లిన సమయంలో అలా జరిగిందని పేర్కొన్నారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు డాక్టర్‌తో వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని, ఆందోళనకారులను సముదాయించి పంపించారు.

పన్నుల వసూలుపై నజర్

షాద్‌నగర్‌లో 48, కొత్తూరులో 57శాతం పూర్తి

- మున్సిపాలిటీల్లో వందశాతం రాబట్టేందుకు చర్యలు
- మొండి బకాయిదారులకు నోటీసులు జారీ!

షాద్‌నగర్: ఆస్తి పన్నుల వసూలుపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చితో ముగియనుండటంతో గడువులోపు వంద శాతం రాబట్టడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు. మొండి బకాయిలపై నజర్ పెట్టారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్ మున్సిపాలిటీలో 28 వార్డులు, 70 వేలకు పైగా జనాభా ఉంది. 15,933 గృహ, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వీటి నుంచి సుమారు రూ.7కోట్ల 15లక్షల పన్ను వసూలు కావాల్సి ఉంది. అయితే ఇందులో ఇప్పటి వరకు యాభైశాతం లోపు, అంటే 7,637 గృహ, వ్యాపార సదుపాయాల నుంచి రూ.3.50 కోట్లను వసూలు చేశారు.



కొత్తూరు మున్సిపల్ కార్యాలయం

కొత్తూరులో..

కొత్తూరు మున్సిపాలిటీలో సుమారు 14వేల జనాభా ఉంది. ఇక్కడ 2,711 గృహ, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వీటి నుంచి రూ.2 కోట్ల 95లక్షలు వసూలు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.కోటి 67లక్షలు (సుమారు 57శాతం) వసూలు అయ్యాయి.

చర్యలు చేపట్టాం



ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు వందశాతం పన్ను వసూలు చేస్తాం. అందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. ప్రస్తుత పన్నుతో పాటు.. బకాయిలు రాబట్టేందుకు కృషి చేస్తున్నాం. పుర ప్రజలు సకాలంలో పన్ను చెల్లించి, అభివృద్ధికి సహకరించాలి.

– వెంకన్న, కమిషనర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ

ప్రత్యేక డ్రైవ్

మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో వంద శాతం పన్ను వసూలు చేసేందుకు మున్సిపాలిటీల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఫంక్షన్ హాళ్లు, పెట్రోల్ బంకులు, సినిమా హాళ్లు, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నుంచి పన్ను వసూలు చేస్తున్నారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించారు. నోటీసులు జారీ చేస్తున్నారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి జైలు

అల్వాల్: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం గురువారం తీర్పు చెప్పింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో నివసించే ధనరాజ్ రెండేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టు నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయాన్ని బాంబులతో పేల్చేస్తామంటూ ఓ వ్యక్తి చేసిన ఫోన్ కాల్‌తో అప్రమత్తమైన పోలీసులు ఉరుకులు పరుగులు పెట్టారు. బుధవారం తెల్లవారుజామున 100 కామారెడ్డికి చెందిన నితిన్ అనే వ్యక్తి ఫోన్ చేసి బాంబుతో ఎయిర్‌పోర్టు పేల్చేస్తామంటు హెచ్చరించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఫోన్ నంబర్ ఆధారంగా అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో తిరిగి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఫార్మాసిటీ కాదు.. ఫ్యూచర్‌సిటీ



భూ బాధిత రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- అన్నదాతలు ఆందోళన చెందొద్దు
- ఎవరికీ అన్యాయం జరగనివ్వం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: ఫార్మాసిటీ రద్దయినట్లే. ఇక అది ఫ్యూచర్‌సిటీనే. ఫార్మాసిటీ వస్తుందని ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఫార్మాసిటీకి భూములు ఇచ్చిన నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులు గురువారం నగరంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిశారు. గత ప్రభుత్వం.. ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వలేదని, రాత్రికిరాత్రే ధరణి పోర్టల్‌లో టీజీఐఐసీ పేరిట తమ భూములను మార్చి తీవ్ర అన్యాయం చేసిందని భూ బాధితులు పేర్కొన్నారు. ఐదేళ్లుగా రైతుబంధు, బ్యాంకు రుణాలు, క్రయ, విక్రయాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి రైతుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

మాటిస్తే తప్పం

మళ్లీ ఫార్మాసిటీ వస్తుందని రైతులు ఆందోళన చెందవద్దని, ఈ ప్రాంతం ఫ్యూచర్‌సిటీ నిర్మాణంతో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. టీజీఐఐసీ పేరు మీద మార్చిన పట్టా భూముల రికార్డులను లీగల్‌గా పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో పేర్లున్న అన్నదాతలకు రైతు భరోసా అందేలా కృషి చేస్తామని చెప్పారు. ఏ రైతుకు అన్యాయం జరగనీయమని, కాంగ్రెస్ మాటిస్తే తప్పదని స్పష్టంచేశారు.

కలెక్టర్‌కు రైతుల విజ్ఞప్తి

భూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డిని రైతులు కోరారు. ఎమ్మెల్యేతో సమావేశం అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. దీనికి స్పందించిన పాలనాధికారి.. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, యాచారం తహసీల్దార్, టీజీఐఐసీ అధికారులతో సమావేశం తరువాత సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు అన్నదాతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనువాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రమేష్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు గణేశ్, మహిపాల్‌రెడ్డి, నిరంజన్, వినోద్‌రెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యాలపై చర్యలకు ఫిర్యాదు

చేవెళ్ల: హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా స్కూల్ బస్సులు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు అల్లి దేవేందర్, బస్సు డ్రైవర్ల యూనియన్ మండల అధ్యక్షుడు కిష్టయ్య కోరారు. చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డికి సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు ముందుగా మండల కేంద్రంలో ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కొన్ని ప్రైవేట్ స్కూళ్ల బస్సు డ్రైవర్ల లైసెన్స్‌లపై సమావేశంలో చర్చించారు. వేతనాలు తక్కువగా ఇచ్చి హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకపోయినా వారితో బస్సులు నడిపిస్తున్నారని, అలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైవింగ్‌లో అనుభవం ఉన్నవారే నడిపించాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులకు తీరని అన్యాయం చేసిన వారమవుతామని చెప్పారు. డ్రైవర్ల యూనియన్ రూల్స్ ప్రకారం డ్రైవర్లు అంతా నడుచుకోవాలన్నారు. ఈ సమావేశంలో డ్రైవర్లంతా కలిసి ఏకగ్రీవంగా ఈ తీర్మానం చేసినట్లు చెప్పారు. ఏ పాఠశాలలో అయినా హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా బస్సులు నడిపిస్తే చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి యూనియన్ రూల్స్ గురించి తెలియజేసినట్లు చెప్పారు. పాఠశాలల యాజమాన్యాలు కూడా ఆయా నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ బస్సు డ్రైవర్ల యూనియన్ మండల ఉపాధ్యక్షుడు సురేందర్, సహాయ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య, రమేశ్, వినోద్, హరికృష్ణ, పాండు తదితరులు ఉన్నారు.



ఎస్ఐకి ఫిర్యాదు అందిస్తున్న దేవేందర్, యూనియన్ నాయకులు

సైబర్ నేరాల నివారణకు ప్రాధాన్యం

- పిరమల్ ఫైనాన్స్ సంస్థ సహకారంతో వీధి నాటికలు

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఏడాది సైబర్ నేరాల నిరోధానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించిన హైదరాబాద్ పోలీసు విభాగం పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. ఇందులో భాగంగా పలు సంస్థల సహకారం తీసుకుంటోంది. ఈ కోణంలో ముందుకు వచ్చిన పిరమల్ ఫైనాన్స్ సంస్థ వీధి నాటికల ద్వారా సామాన్యుల్లో సైబర్ నేరాలపై అవగాహనకు ముందుకు వచ్చింది. ఈ కార్యక్రమాన్ని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం ప్రారంభించారు. ఆయా సీజన్లలో ఎక్కువగా జరిగే సైబర్ నేరాలు, వాటి తీరుతెన్నుల్ని వివరిస్తూ ఈ నాటికలను డిజైన్ చేశారు. బుధ–గురు వారాల్లో ఈ వీధినాటిక బృందం చార్మినార్, బహదూర్‌పురా, నెక్లెస్ రోడ్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మైత్రీవనం, సచివాలయం, కేబీఆర్ పార్క్, మలక్‌పేట, ఐఎస్‌సదన్, సంతోష్‌నగర్, తార్నాక చౌరస్తాలో ప్రదర్శనలు నిర్వహించింది. ఆరు నిమిషాల నిడివితో ఉండే ఈ వీధి నాటిక ప్రస్తుతం తెలుగులోనే అందుబాటులో ఉండగా... రానున్న రోజుల్లో ఆంగ్లం, హిందీ, ఉర్దూల్లోనూ రూపొందించాలని నగర పోలీసు అధికారులు పిరమల్ సంస్థను కోరారు.

సైబర్ బాధితుల్లో విద్యాధికులు సైతం...

సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో సామాన్యులే కాదు.. విద్యాధికులు సైతం ఉంటున్నారు. 13 ఏళ్ల నుంచి 86 ఏళ్ల మధ్య వయస్కులు బాధితులుగా మారుతున్నారు. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు కాజేసిన మొత్తం రూ.3500 కోట్ల వరకు ఉంటోంది. డాక్టర్లు, ఇంజినీర్లు, వ్యాపారులతో పాటు సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన వాళ్లూ మోసపోతున్నారు. నాతో కలిసి గోల్ఫ్ ఆడే ఓ ప్రముఖ డాక్టర్ ఏకంగా రూ.15.5 కోట్లు పోగొట్టుకున్నారు. ఆయన్ను అలా ఎలా బాధితుడిగా మారారు? అంటూ ప్రశ్నించాను. ఫోన్ చేసే సైబర్ నేరగాళ్లు హిప్నటైజ్ చేస్తారని, మీ దాకా వస్తే మీకే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి అనేక మంది నిత్యం మోసపోతున్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలు, అన్ని రంగాల వారికీ అవగాహన కల్పించాలని నిర్ణయించాం. ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం’.



బైక్‌ల దొంగ అరెస్ట్

నల్లగొండ: బైక్‌లు చోరీ చేస్తున్న దొంగను నల్లగొండ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు పూర్వాపరాలను గురువారం నల్లగొండ టూటౌన్ ఠాణాలో డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి చెందిన డీకే నరసింహకు నల్లగొండ జిల్లా మునుగోడు మండలం వెల్మకన్నె గ్రామానికి చెందిన ఝాన్సీతో వివాహం జరిగింది. 2019 నుంచి నరసింహ వెల్మకన్నెలోని తన అత్తగారింట్లోనే ఉంటున్నాడు. నరసింహ గతంలో రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గ్యాస్ సిలిండర్ దొంగతనం చేసి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడు. మద్యానికి, ఇతర వ్యసనాలకు బానిసైన నరసింహ.. బైక్‌లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని హయత్‌నగర్, వనస్థలిపురం పోలీస్ స్టేషన్లతో పాటు మునుగోడు, చౌటుప్పల్, నల్లగొండ వన్ టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 2 స్కూటీలు, 5 బైక్‌లు చోరీ చేసి వాటిని తక్కువ ధరకు సాగర్ రోడ్డులో బైక్ మెకానిక్ షాపు నడిపే మేడి రమేష్‌కు అమ్మి, వచ్చిన డబ్బులను వ్యసనాలకు ఖర్చు పెట్టేవాడు. ఈ నెల 29న సాయంత్రం నల్లగొండ బస్టాండ్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. నరసింహ స్కూటీపై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నరసింహను విచారించగా.. 2 స్కూటీలు, 5 బైక్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి నుంచి రూ.5 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. టూటౌన్ సీఐ రాఘవరావు, ఎస్ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది శంకర్, బాలకోటిని ఎస్పీ అభినందించారు.

శ్రీలక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకురాలి అరెస్ట్

- దేశం విడిచి పారిపోయేందుకు యత్నం
- ఎయిర్‌పోర్ట్‌లో పట్టుకున్న పోలీసులు



గుర్రం విజయలక్ష్మి

దుండిగల్: నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టడమేగాక, వినియోగదారులను మోసం చేసి రూ.కోట్లు సంపాదించింది. పోలీసు కేసులు నమోదు కావడంతో దేశం విడిచి పారిపోయేందుకు యత్నించిన ఓ నిర్మాణ సంస్థ యజమానురాలిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో మల్లంపేటలోని సర్వే నెంబర్ 170/3, 170/4, 170/5లోని 15 ఎకరాల భూమిని పాతికేళ్ల క్రితం ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులకు అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఆ తర్వాత సదరు భూమి పలువురి చేతులు మారి చివరికి కొన్నేళ్ల క్రితం శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ సంస్థకు చేరింది. సంస్థ నిర్వాహకురాలు గుర్రం విజయలక్ష్మి ఐదేళ్ల క్రితం 3.20 ఎకరాల్లో 65 విల్లాల నిర్మాణం కోసం హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసుకుంది. ఆ తర్వాత సదరు సంస్థ ఎలాంటి అనుమతులు లేకుండానే పక్కనే ఉన్న కత్వ చెరువుకు సంబంధించిన 16 గుంటల ఎఫ్‌టీఎల్, మూడు ఎకరాల బఫర్ జోన్‌ను ఆక్రమించి ఏకంగా 300కు పైగా విల్లాలను నిర్మించింది. దీనిపై స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని 11 అక్రమ విల్లాలను గత సెప్టెంబర్‌లో అధికారులు కూల్చివేశారు. అంతేగాక ఇరిగేషన్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టారని దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి తోడు తమకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని చెప్పి మోసం చేశారని, రిజిస్ట్రేషన్లు సైతం చేసుకుని బ్యాంకుల్లో రుణాల్లో తీసుకుని రూ. లక్షలు వెచ్చించి ప్లాట్లను కొనుగోలు చేశామని, చివరికి తమ విల్లాలను కూల్చివేశారని, సంస్థ నిర్వాహకురాలు గుర్రం విజయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని బాధితులు దుండిగల్ పోలీసులను ఆశ్రయించారు. విజయలక్ష్మిపై ఇప్పటి వరకు ఏడు కేసులు నమోదు చేసిన పోలీసులు లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. కాగా గురువారం తెల్లవారుజామున దేశం విడిచి పారిపోయేందుకు ప్రయత్నించిన ఆమెను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు అదుపులోకి తీసుకుని దుండిగల్ పోలీసులకు అప్పగించారు. వారు ఆమెను న్యాయమూర్తి ఎదుట హాజరు పరచడంతో 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆమెను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల కూల్చివేత



ప్రీకాస్ట్‌ను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

నందిగామ: ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన అక్రమ కట్టడాలను గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేయించారు. ఆర్ఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నందిగామ శివారు సర్వే నం. 1582లోని ప్రభుత్వ భూమిలో 900 గజాలను ఆక్రమించి నిర్మించిన ప్రీకాస్ట్‌ను గుర్తించి, జేసీబీ సహాయంతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కత్తితో దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

జియాగూడ: ఓ యువతిని వేధిస్తుండగా అడ్డుకున్నందుకు ఇద్దరు వ్యక్తులపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటనలో కుల్సుంపురా పోలీసులు గురువారం ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ సునీల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. రెండు రోజుల క్రితం జియాగూడ వెంకటేశ్వర నగర్‌లో రోడ్డుపై వెళుతున్న యువతిని ఐదుగురు యువకులు వేధిస్తున్నారు. దీనిని గుర్తించిన తందూరి నైట్స్ హోటల్ నిర్వాహకులు ఆకాష్, వికాస్ వారిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు. దీంతో వారిపై కక్ష పెంచుకున్న జియాగూడకు చెందిన శ్రీకాంత్, దీపక్‌సింగ్, ఆకాష్‌కుమార్, శంషాబాద్‌కు చెందిన పవన్ అలియాస్ మొగిలి బుధవారం రాత్రి జియాగూడ మెయిన్‌రోడ్డులో ఆకాష్, వికాస్‌లపై కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో వికాస్ తలకు తీవ్ర గాయాలు కాగా, ఆకాష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాధితులను ఆసుపత్రికి తరలించారు. నిందితులు శ్రీకాంత్, దీపక్ సింగ్, ఆకాష్ కుమార్‌లను అదుపులోకి తీసుకోగా హర్షసింగ్, మొగిలి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సివిల్ తగాదాలో బెదిరిస్తున్న ఎస్ఐపై ఫిర్యాదు

శంషాబాద్ రూరల్: పట్టా భూమిలో నుంచి ఇతరులకు దారి వదిలిపెట్టాలని ఎస్ఐ నర్సింహారావు కల్పించుకోవడంతో పాటు తనపై చేయి చేసుకుని దుర్భాషలాడారని బాధితుడు గురువారం శంషాబాద్ డీసీపీకి ఫిర్యాదు చేశాడు. శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద గోల్కొండకు చెందిన కె.బాబుకిరణ్‌కు, వి.ఎస్.రాజు అనే వ్యక్తికి దారి విషయం గొడవ జరిగింది. ఈ విషయమై పోలీసులకు నర్సింహారాజు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఎస్ఐ నర్సింహారావు పొలం వద్దకు విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా వేరే వర్గం వారికి అనుకూలంగా వ్యవహరించడంతో పాటు తనను దుర్భాషలాడి అందరి ముందు చేయి చేసుకున్నారని బాబుకిరణ్ డీసీపీకి ఫిర్యాదు చేశారు. తనను పోలీసు వాహనంలో కొద్ది దూరం తీసుకెళ్లి ఫోన్ తీసుకుని వదిలేశారని పేర్కొన్నారు. సివిల్ తగాదాలో తనను బెదిరించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నార్సింగి మున్సిపల్ మేనేజర్‌కు పదోన్నతి

మణికొండ: నార్సింగి మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తున్న యోగేష్‌కు కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఆయనను రాష్ట్ర ప్రభుత్వం శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా నియమించటంతో గురువారం అక్కడ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను తోటి ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు. నార్సింగికి ఆయన స్థానంలో మేనేజర్‌గా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదని అధికారులు తెలిపారు.

సంగీతం.. పూర్వ జన్మ సుకృతం

సినీ సంగీత దర్శకుడు కోటి

మణికొండ: సంగీతం వాయించటం పూర్వజన్మ సుకృత ఫలం ఉంటేనే సిద్ధిస్తుందని సినీ సంగీత దర్శకుడు కోటి అన్నారు. పియానోయిస్ట్ టీఎస్ సతీష్‌కు యూకే హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ రావటంతో గండిపేటలోని ఆయన నివాసంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ... తనకు ఎన్నో గొప్ప సినిమాలకు మ్యూజిక్ డైరెక్టర్‌గా అవకాశం వచ్చిందన్నారు. తన ఇంట్లో తన తండ్రి పియానో వాయించే వారని, అతను వాయించిన పియానోకు వంద సంవత్సరాలు దాటిందన్నారు. టీఎస్ సతీష్ భవిష్యత్తులో మంచి పియానోయిస్ట్ అవుతారని, మరింత సాధన చేయాలని సూచించారు.

అపార్ నమోదును వేగవంతం చేయాలి

అత్తాపూర్: కేంద్ర ప్రభుత్వం సూచించిన మేరకు దేశంలోని ప్రైవేట్, గవర్నమెంట్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల పూర్తి వివరాలు యుద్ధ ప్రతిపాదికన రికార్డుల్లో నమోదు చేయాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ తెలిపారు. అపార్ నమోదు ప్రక్రియలో భాగంగా అత్తాపూర్‌లోని గురునానక్ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలల యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ... విద్యార్థులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అపార్ విద్యా విధానాలతో ఎంతో మేలు జరుగుతుందన్నారు.